
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
శనివారం 14 డిసెంబరు 2024



నేడు అధికారుల సంక్షేమ హాస్టళ్ల బాట

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లల్లో నెలకొన్న సమస్యలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అధికారులను తరచూ హాస్టళ్లను తనిఖీ చేయాలని ఆదేశాలిచ్చింది. ఈమేరకు నేడు(శనివారం) జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులతో కలిసి అధికారులు సహపంక్తి భోజనం చేయనున్నారు. విద్యార్థులకందించే సరుకుల క్వాలిటీ, క్వాంటిటీ విషయమై ఆరా తీయనున్నారు.

మల్లికార్జునస్వామి జాతర ప్రారంభం

తాండూరు మండలం గౌతాపూర్‌లో
మూడురోజుల పాటు ఉత్సవాలు
నేడు స్వామివారి భజన, రేపు బోనాలు
పెద్ద సంఖ్యలో హాజరుకానున్న భక్తజనం

7



వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ

వికారాబాద్, దోమ, కంకల్, పూడూరు
జడ్పీహెచ్ఎస్ విద్యార్థుల సత్తా
బహుమతులు అందజేసిన
స్పీకర్ ప్రసాద్‌కుమార్, కలెక్టర్ ప్రతీక్‌జైన్

7



షాపూర్‌లో తాగునీటి తంటాలు

వారం రోజులుగా నీరు బంద్..
గ్రామస్థుల ఇబ్బందులు
మరమ్మతులు చేయాలని అధికారులకు విన్నపం..
కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం

7





విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి డీబీ శీతల్

18 ఏళ్ల లోపువారు వాహనాలు నడపొద్దు

» సీనియర్ సివిల్ జడ్జి డీబీ శీతల్

వికారాబాద్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): 18 ఏళ్ల లోపువారు వాహనాలు నడపకూడదని.. పెద్దయ్యాక లైసెన్స్ తీసుకొని మాత్రమే నడపాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి డీబీ శీతల్ అన్నారు. శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సును పట్టణంలోని మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ సమాజంలో విద్యార్థులు పాటించాల్సిన బాధ్యతలపై వివరించారు. ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని, లక్ష్య సాధనలో అలసత్వం చూపకూడదని అన్నారు. కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ వెంకటేశ్, డిఫెన్స్ కౌన్సిల్ శ్రీనివాస్, సిబ్బంది, ప్రిన్సిపాల్ మెహబూబ్ ఫాతిమా, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

రెండేళ్లలో కేసులు తగ్గుముఖం

» వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

యాలాల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గత రెండేళ్లతో పోలిస్తే ప్రస్తుతం కేసుల సంఖ్య తగ్గిందని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం యాలాల పోలీసు స్టేషన్‌ను ఎస్పీ సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బంది ఎస్పీకి గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఆవరణలో మొక్క నాటి నీరు పోశారు. అనంతరం ఫిర్యాదులను పరిశీలించారు. ఏయే సమస్యలపై అధికంగా ఫిర్యాదులు వచ్చాయనే విషయాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ విలేకరులతో మాట్లాడారు. రోజురోజుకూ వాహనాల వినియోగం తీవ్రమవుతోందని, ప్రమాదాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. పోలీసులు ఎప్పటికప్పుడు వాహనాల తనిఖీ చేపడుతున్నామని, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తున్నామని ఎస్పీ తెలిపారు. సైబర్‌క్రైంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు ఎస్పీ వివరించారు. ఈ కార్యక్రమంలో తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, ఇన్‌చార్జి సీఐ సంతోష్ కుమార్, యాలాల ఎస్సై గిరి, సిబ్బంది ఉన్నారు.



పౌష్టికాహారంతో ఆరోగ్యపుష్టి

సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో నేటి నుంచి కొత్త మెనూ

మెస్ చార్జీల పెంపుతో విద్యార్థులకు పోషకాహారం
సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్లల్లో అమలు

ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లోని విద్యార్థులకు డైట్ ఛార్జీలతో పాటు కాస్మెటిక్ ఛార్జీలను పెంచిన విషయం తెలిసిందే. ఇదివరకు ఉన్న డైట్ ఛార్జీలతో పోలిస్తే.. ప్రస్తుతం 40 శాతం పెరిగాయి. పెంచిన ధరలతో కొత్త మెనూ నేటి(శనివారం) నుంచి అమల్లోకి రానుంది. జిల్లాలో 93 గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయి. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులందరికీ కొత్త డైట్, కాస్మెటిక్ ఛార్జీలు వర్తించనున్నాయి. ఈమేరకు పండగ వాతావరణంలో నేడు జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించనున్నారు.

వికారాబాద్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో నేటి నుంచి మెనూ మారనుంది. పేద విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన పౌష్టికాహారం అందించే విధంగా కొత్త మెనూ అమలు చేయనున్నారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లోని విద్యార్థులకు ప్రభుత్వం డైట్ చార్జీలతో పాటు కాస్మెటిక్ చార్జీలను పెంచిన విషయం తెలిసిందే. ఇదివరకు ఉన్న డైట్ చార్జీలతో పోలిస్తే.. 40 శాతం పెరిగాయి. 2017 తర్వాత ఇప్పుడే డైట్ చార్జీలు పెరిగాయి. పెంచిన చార్జీలతో కొత్త మెనూ శనివారం నుంచి అమల్లోకి రానుంది. జిల్లాలో 93 గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయి. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులందరికీ కొత్త డైట్, కాస్మెటిక్ చార్జీలు వర్తించనున్నాయి. విద్యార్థుల అల్పాహారం, భోజనం

మిగతా 8వ పేజీలో...

పోషకాహారం అందేలా మెనూ..

ఇంతకాలం సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో విద్యార్థులకు అందించిన అల్పాహారం, భోజనం మెనూ మారనుంది. అల్పాహారమైనా, భోజనమైనా విద్యార్థులకు పోషకాలు అందేవిధంగా మెనూ రూపొందించారు. అల్పాహారం కింద విద్యార్థులకు పులిహోర, కిచిడీ, టమాట రైస్, జీరా రైస్, ఉప్మా, సాంబారు.. అరటిపండ్లు ఇస్తారు. మధ్యాహ్నం అన్నంతో పాటు పాలకూర పప్పు లేదా వెజిటబుల్ కర్రీ పెడతారు. రాత్రి అన్నం, వెజిటబుల్ కర్రీ, సాంబారు, మజ్జిగ ఇస్తారు. బుధ, ఆదివారాల్లో చికెన్, ఆదివారం చికెన్ తినని వారికి బగారా రైస్, 4రోజులు కోడిగుడ్లు అందజేస్తారు. శనివారం రాత్రి భోజనంతో పాటు పాలకూర పప్పు, సాంబారు, అరటి పండు ఇస్తారు.

డైట్ కార్యక్రమాన్ని పండగలా నిర్వహించాలి

కలెక్టర్ ప్రతీక్ జైన్

8



గజగజ

» చలిగాలులతో అల్లాడుతున్న జనం
» రోజురోజుకూ పడిపోతున్న ఉష్ణోగ్రతలు

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): చలి పులి పంజా విసురుతోంది. గత నాలుగు రోజులుగా ఉష్ణోగ్రతలు పడిపోతుండటంతో పాటు చలి గాలులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధుల పరిస్థితి వర్ణనాతీతం. జలుబు, దగ్గు, జ్వరాలతో అనారోగ్యాల బారినపడుతున్నారు. మేడ్చల్ జిల్లాలో గత నాలుగు రోజులుగా దాదాపు 17 డిగ్రీల వరకు రాత్రిపూట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలి కారణంగా రాత్రి ఏడు గంటల నుంచి ప్రజలు ఇళ్లనుంచి బయటకు రావాలంటే జంకుతున్నారు. ఇక ఉదయం 9 గంటల వరకు కూడా చల్లని గాలులు వీస్తుండటంతో పాటు వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈసారి వర్షాలు కూడా అధికంగా కురిసినందున మున్ముందు చలి కూడా తీవ్రంగానే ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. చలి నుంచి తమను తాము కాపాడుకోవడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండే వృద్ధులు, చిన్నపిల్లలు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

సీఎంఆర్ ధాన్యాన్ని ప్రభుత్వానికి ఇవ్వాలి

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్
జిల్లా మిల్లర్లతో సమావేశం

7

సైన్స్‌ఫెయిర్‌తో సృజనాత్మకత వెలికితీత

» అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్
» కొత్తగడి గురుకుల పాఠశాలలో ముగిసిన జిల్లాస్థాయి విజ్ఞాన ప్రదర్శనలు



విద్యార్థుల ప్రదర్శనను తిలకిస్తున్న స్పీకర్, కలెక్టర్

వికారాబాద్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సృజనాత్మకతను వెలికి తీయడానికి సైన్స్‌ఫెయిర్ ఎంతో ఉపయోగపడుతుందని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కొత్తగడి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జిల్లాస్థాయి విజ్ఞాన ప్రదరన్శలు ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఆధునిక కాలంలో సైన్స్ అండ్ టెక్నాలజీ మనుషుల జీవితాల్లో భాగమయ్యాయన్నారు. ఈ రోజు మనం వాడుతున్న ప్రతీ వస్తువు పరిశోధనల ద్వారా ఆవిష్కరించినవేనని, విద్యార్థులు వినూత్నంగా ఆలోచనలు చేస్తేనే గుర్తింపు వస్తుందన్నారు. న్యూటన్, ఐన్‌స్టీన్, సీవీ రామన్.. తదితరులు వినూత్న ఆలోచనలతో గొప్ప శాస్త్రవేత్తలు అయ్యారని గుర్తుచేశారు. ఆవిష్కరణలకు అంతం లేదని.. ప్రస్తుతం వాడుతున్న వాటికంటే ఇంకా ఆధునిక, సౌకర్యవంతమైన వస్తువులు వస్తే ఎంతో డిమాండ్ ఉంటుందన్నారు. కార్లు, కంప్యూటర్లు, ఫోన్, ఇంటర్నెట్‌తో పాటు విమానాలు, రాకెట్ల తయారీలో ఎన్నోమార్పులు వచ్చాయని.. ప్రతీ సంవత్సరం అడ్వాన్స్‌డ్ మోడల్స్ వస్తున్నాయన్నారు. మొదట బ్లాక్ అండ్ వైట్ టీవీ స్థానంలో కలర్ టీవీలు వచ్చాయని.. ఇప్పుడు ప్లాస్మా, వాల్ పేపర్ టీవీలు వస్తున్నాయన్నారు. గతంలో ల్యాండ్ లైన్ ఫోన్ ఉండేదని, తరువాత కీపాడ్ ఫోన్, ఇప్పుడు స్మార్ట్‌ఫోన్.. భవిష్యత్తులో ఇంకా ఎంత ఆధునికం అవుతుందో చూడాలన్నారు. ఈ భూమ్మీద మనుషులే కాదు జంతువులు, పక్షులు, జలచరాలు, చెట్లు అన్నీ ఉన్నాయని.. ప్రస్తుతం కాలుష్యంతో వాతావరణం దెబ్బతింటోందని.. దానిని కంట్రోల్ ఎలా చేయాలనే విషయంలో పరిశోధనలు చేయాలన్నారు. వ్యవసాయ రంగంలో తక్కువ నీటితో పంటలు ఎలా పండించాలి.. రైతులకు మంచి దిగుబడులు ఎలా రాబట్టాలనే విధంగా పరిశోధనలు చేస్తూ రైతులకు మేలు చేయాలన్నారు. బాగా చదువుకొని మంచి సైంటిస్టులు కావాలని, అందరికీ ఉపయోగపడే ఆవిష్కరణలు చేయాలని కోరారు. అనంతరం విజ్ఞాన ప్రదర్శనలో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు, ప్రశంసా పత్రాలను స్పీకర్ అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, ట్రైనీ కలెక్టర్ ఉమా హారతి, ఆర్డీవో వాసుచంద్ర, డీఈవో రేణుకాదేవి, డీఎస్‌వో విశ్వేశ్వర్, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు బీఎస్ రెడ్డి, మునిసిపల్ చైర్‌పర్సన్ మంజులా రమేష్, పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు వేణుగోపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నాయకులు సత్యనారాయణ, కిషన్‌నాయక్, అనంత్‌రెడ్డి, చిగుళ్లపల్లి రమేష్‌కుమార్, సర్వరాజ్, సతీష్, రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.



వెల్లివిరిసిన మత సామరస్యం

అయ్యప్పస్వాములకు భిక్ష ఏర్పాటు చేసిన ముస్లిం
కులకచర్ల అయ్యప్ప కొండపై ఆలయంలో కార్యక్రమం

6

అడ్డు తొలగించుకునేందుకే మహిళపై హత్యాయత్నం

కేసును ఛేదించిన పోలీసులు
నిందితుల అరెస్టు.. రిమాండ్

7

దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలి

» ఇందిరమ్మ ఇళ్లపై అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని ఈనెల చివరి వరకు పూర్తి చేయాలని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలనపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇళ్ల కొరకు లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల నుంచి వచ్చిన దరఖాస్తులను మొబైల్ యాప్ ద్వారా అప్‌లోడ్ చేసే కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించాలని, దరఖాస్తులన్నింటినీ ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన ఇందిరమ్మ ఇళ్ల ఇన్‌స్పెక్షన్ మొబైల్ యాప్ ద్వారా గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు, మునిసిపాలిటీల్లో వార్డు అధికారులు పరిశీలించాలని సూచించారు. సెక్రటరీలు, వార్డు ఆఫీసర్లు దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని వెంటనే ప్రారంభించాలని, ఇందిరమ్మ కమిటీలు సైతం కార్యదర్శులతో కలిసి పరిశీలించాలన్నారు. దరఖాస్తుదారు.. బీపీఎల్ కార్డు వర్గం, ప్రస్తుత నివాస గృహానికి సంబంధించిన పూర్తి వివరాలు, కులం, చిరునామాతో పాటు అన్ని వివరాలను సేకరించాలన్నారు. అదేవిధంగా ఇంటి వద్ద తీసుకున్న ఫొటో, ఇంటి పరిస్థితిపై లోపల, బయట ఫొటోలు, కొత్తగా నిర్మించుటకు తలపెట్టిన స్థలం, దానికి సంబంధించిన పూర్తి వివరాలను మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేసే విధానంపై అవగాహన కల్పించారు. అదనపు కలెక్టర్ సుధీర్, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, మునిసిపల్ కమిషనర్లు, వార్డు ఆఫీసర్లు, జీపీ కార్యదర్శులు, సర్వేయర్లు పాల్గొన్నారు.

విద్యార్థులతో పనులు!

» వికారాబాద్ జిల్లా జీవన్గి జడ్పీహెచ్ఎస్‌లో వెలుగులోకి..

బషీరాబాద్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): టీచర్లు విద్యార్థులతో పనులు చేయించిన ఘటన మండలంలోని జీవన్గి జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం చోటుచేసుకుంది. కాగా, ఈ విషయం స్థానికంగా చర్చనీయాంశమైంది. పాఠశాలలో సైన్స్‌ల్యాబ్‌ను వేరొక గదిలోకి మార్చేందుకు ఉపాధ్యాయులు స్థానిక పంచాయతీ కార్మికులను పిలిపించారు. ఈక్రమంలో కార్మికులకు తోడుగా విద్యార్థులను పంపించి బల్లలు, బీరువా, కుర్చీలను ఖాళీ చేయించారు. ఇదంతా చూసిన స్థానికులు కొందరు ఇదేం పని.. విద్యార్థులను చదువు కోసం పంపిస్తే పనులు చేయిస్తున్నారంటూ చర్చించుకున్నారు. ఈ విషయమై అక్కడున్న ఉపాధ్యాయులను విలేకరుల ప్రశ్నించగా సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారు.



జీవన్గి పాఠశాలలో పనులు చేస్తున్న విద్యార్థులు



వెల్లివిరిసిన మతసామరస్యం

అయ్యప్పస్వాములకు బిక్ష ఏర్పాటు చేసిన ముస్లిం



కులకచర్లలో అయ్యప్ప స్వాములకు భోజనం వడ్డిస్తున్న రుక్మోద్దిన్

కులకచర్ల, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): కులమతాలకతీతంగా సోదరభావంతో ఓ ముస్లిం అయ్యప్పస్వాములకు బిక్ష (భోజనం) ఏర్పాటు చేసి మతసామరస్యాన్ని చాటుకున్నాడు. వికారాబాద్ జిల్లా కులకచర్ల మండల పరిధిలోని అయ్యప్ప కొండపై గల దేవాలయంలో అయ్యప్పస్వాములకు శుక్రవారం కులకచర్ల గ్రామానికి చెందిన ముస్లిం రుక్మోద్దీన్ సొంత డబ్బుతో బిక్ష ఏర్పాటు చేశాడు. ఈ సందర్భంగా రుక్మోద్దీన్‌ను అయ్యప్పస్వాములు సన్మానించారు. అయ్యప్పస్వాములకు భోజనం ఏర్పాటు చేయడం అభినందనీయమని పలువురు అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు సౌమ్యారెడ్డి, ఆలయ చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి, గురుస్వాములు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ డెత్ సర్టిఫికెట్‌తో ప్లాట్ స్వాహా

నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్

షాద్‌నగర్ రూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం పెట్టి ఇతరుల ప్లాట్‌ను రిజిస్ట్రేషన్ చేసుకున్న ఘటనలో నిందితులను అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు పంపినట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన కిరణ్ తివారీ తన భర్త దీపక్ తివారీతో కలిసి షాద్‌నగర్‌లోని ఆర్టీసీ కాలనీలో ఉంటున్నారు. ఇదే ప్రాంతంలోని పరిశ్రమల్లో పనిచేస్తూ ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం శివారులోని 'బిల్డింగ్ బ్లాగ్స్' అనే రియల్ వెంచర్‌లో 2013లో సర్వే నంబర్ 115, 117, 118లలో ప్లాట్ నంబర్ 1297లో 133గజాల స్థలం కొన్నారు. కాగా హైదరాబాద్‌కు కాళీ కమాన్‌కు చెందిన గోపాల్, మీర్‌ఆలం మండికి చెందిన దర్గా గోపీశ్వర్, టిల్లు అనే వ్యక్తులు కిరణ్ తివారీ చనిపోయారని నకిలీ డెత్ సర్టిఫికెట్ సృష్టించారు. వారిపై ఆస్తికి దీపక్ తివారీ వారసుడని తప్పుడు లీగల్ హెయిర్ సర్టిఫికెట్ తీసుకున్నారు. రెండు దొంగ సర్టిఫికెట్లతో ఆస్తి బదిలీ కోసం మీ సేవలో దరఖాస్తు చేసుకున్నారు. అశోక్ అలియాస్ టిల్లు అనే వ్యక్తిని దీపక్ తివారీగా చూపి 2021లో గోపాల్ పేరిట ప్లాట్‌ను రిజిస్ట్రేషన్ చేయించారు. డాక్యుమెంటేషన్‌ను విజయ్ అనే వ్యక్తి చేశాడు. ఇదే ఆస్తిని 2022లో ముఠాలోని గోపీశ్వర్ పేరిట రిజిస్ట్రేషన్ చేశాడు. సాక్షులుగా హైదరాబాద్‌కు చెందిన అబ్దుల్ జమీల్, షాబాద్ మండలం బోనగిరిపల్లికి చెందిన లింగాల విజయ్‌లను పెట్టారు. వీరి మోసాన్ని గ్రహించిన బాధితురాలు కిరణ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేసిన నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. టిల్లు పరారీలో ఉన్నాడన్నారు. ఈ ఆస్తి రిజిస్ట్రేషన్‌లో అప్పటి సబ్‌రిజిస్ట్రార్ సతీష్ పాత్రపైనా విచారణ చేస్తున్నామని ఆయన వివరించారు.

ధరణి పోర్టల్ సేవలు తాత్కాలికంగా బంద్



మోమిన్‌పేట్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ధరణి పోర్టల్ సేవలను సాంకేతిక కారణాల నేపథ్యంలో తాత్కాలికంగా నిలిపివేస్తున్న తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి తెలిపారు. ఈ నెల 16 వరకు ధరణి సేవలు ఉండవని తెలిపారు. ధరణి పోర్టల్ డాటాబేస్ వెర్షన్ అప్‌గ్రేడ్ చేస్తుండటంతో ఈ అంతరాయం ఏర్పడిందన్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చేంత వరకు భూ సమస్యలు, రిజిస్ట్రేషన్లు కొనసాగవని తెలిపారు.

వైభవంగా లక్ష్మీవేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు



పూజల్లో ఆలయ చైర్మన్ పవన్‌కుమార్‌రెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి

తలకొండపల్లి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాంపూర్ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. ఆలయ చైర్మన్ జిల్లెల పవన్‌కుమార్‌రెడ్డి, ఈవో స్నేహలత ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాల రెండో రోజు శుక్రవారం ధ్వజారోహణం, అభిషేకపూజలు నిర్వహించారు. శనివారం నాటి కల్యాణోత్సవానికి ఎమ్మెల్యే నారాయణరెడ్డి, ఎంపీ ఎం.రవి, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, అర్చకులు నర్సింహాచారి, ఆలయ కమిటీ వైస్‌చైర్మన్ అమృత, డైరెక్టర్లు స్వామిగౌడ్, వెంకటయ్య, యాదయ్య, జంగిలి, నాయకులు హరిమోహన్‌రెడ్డి, శేఖర్, ఎండోమెంట్ అధికారులు పాల్గొన్నారు.

హామీలు విస్మరించిన కాంగ్రెస్



కమిటీ అధ్యక్షులకు నియామకపత్రాలు అందజేస్తున్న నాయకులు

కడ్తాల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలేవీ అమలు చేయలేదని బీజేపీ మండల అధ్యక్షుడు మన్యనాయక్, దళితమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు నింగ్యారి యాదగిరి, మండల ప్రధాన కార్యదర్శి డి.మహేశ్ అన్నారు. కాంగ్రెస్ అంటేనే మోసం అని మరోసారి రుజువైందన్నారు. మక్తమాదారంలో శుక్రవారం బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్టీ బలోపేతం, బూత్ కమిటీల ఏర్పాటు, స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. 4వ బూత్ కమిటీ అధ్యక్షుడిగా బొల్లం మురళి, ఐదో బూత్ కమిటీ అధ్యక్షుడిగా ఎ.రమేశ్‌లను నియమించారు. నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సూచించారు. సమావేశంలో ప్రభాకర్‌గౌడ్, నరేశ్, శంకరయ్య, రాందాస్, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

జీపీ బోరు నీటితో కల్లు తయారీ



కల్లు దుకాణానికి వాడుతున్న పంచాయతీ బోరు

చౌదరిగూడ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడలోని 8వ వార్డులో పంచాయతీ బోరును ప్రైవేట్ వ్యక్తులు వ్యాపారానికి వినియోగిస్తున్నారు. గతంలో ఈ బోరు నీటిని కాలనీ వాసులు వినియోగించుకునేవారు. ఇప్పుడు ఓ వ్యక్తి ఈ బోరు నుంచి కల్లు కాంపౌండ్‌కు పైప్‌లైన్ వేసుకొని వాడుకుంటున్నాడని కాలనీవాసులు చెబుతున్నారు. ఈ బోరుకు పైప్‌లైన్ తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. మరో బోరును మాజీ సర్పంచ్ పంచాయతీ వాటర్ ఫిల్టర్‌కు వినియోగిస్తున్నాడని ఆరోపణలున్నాయి. వీటిపై పంచాయతీ కార్యదర్శి స్పందన కోరగా ఇంటి యజమానికి నోటీసులిచ్చామని, పంచాయతీ బోరును ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

డివిజన్ కార్యాలయాల ఏర్పాటుకు కృషి చేస్తా



ఎంపీ మల్లురవిని సన్మానిస్తున్న కేశవులు

ఆమనగల్లు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లులో డివిజన్ కార్యాలయాల ఏర్పాటుకు కృషి చేస్తానని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి అన్నారు. ఆమనగల్లులో ఆర్డీవో, ఎస్టీవో, సబ్‌రిజిస్ట్రార్, ఏసీపీ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని ఆమనగల్లు ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ గుర్రం కేశవులు శుక్రవారం ఢిల్లీలో రవిని కలిసి వినతిపత్రమిచ్చారు. ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయం, జిల్లా పరిషత్ పాఠశాల వద్ద షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించి చిరు వ్యాపారులకు సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే షాబాద్‌లో కొనసాగుతున్న ఆమనగల్లు గురుకుల పాఠశాలకు ఆమనగల్లులో భవనాన్ని నిర్మించాలన్నారు. జూనియర్, డిగ్రీ కాలేజీలకు భవనాలు నిర్మించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి రవి సానుకూలంగా స్పందించి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోతానని చెప్పారని కేశవులు పేర్కొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు




తాండూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు చేపట్టనున్నట్లు అడిషనల్ ఎస్పీ హనుమంత్‌రావు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డితో శాంతిభద్రతలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ ధారాసింగ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు హబీబ్ లాల, నాయకులు అబ్దుల్ రజాక్ పాల్గొన్నారు.














వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ



స్పీకర్ చేతుల మీదుగా బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

దోమ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): 52వ జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనలో భాగంగా వికారాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభ కనబర్చి ద్వితీయ బహుమతులు సాధించారు. 'వనరుల నిర్వాహణ' అనే అంశంపై దోమ మండలంలోని దాదాపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థి దయాకర్, సిరిధాన్యాలు అంశంలో అక్షయ ప్రతిభ కనబర్చి ద్వితీయ బహుమతిని కైవసం చేసుకున్నారు. వీరికి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, కలెక్టర్ ప్రతీక్‌జైన్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. విద్యార్థులను ప్రోత్సహించిన ఉపాధ్యాయులు శాంతకుమార్, ఫేరోజ్‌లను హెచ్ఎం అమర్‌నాథ్ అభినందించారు.

పూడూరు: జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో జడ్పీహెచ్ఎస్ కంకల్, పూడూరు విద్యార్థినులు ప్రతిభ కనబర్చారు. పాఠశాలకు చెందిన శ్రీనిధి, వైష్ణవిలు జిల్లాస్థాయి రెండోస్థానంలో నిలిచారు. వీరికి స్పీకర్ ప్రసాద్‌కుమార్ బహుమతులు అందజేశారు. గైడ్ టీచర్ మహేశ్వరి, జీహెచ్ఎం పుష్ప, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

సీఎంఆర్ ధాన్యాన్ని ప్రభుత్వానికి ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): యాసంగి 2022-23, వానాకాలం 2023-24 సంవత్సరాలకు సంబంధించి సీఎంఆర్ ధాన్యాన్ని వెంటనే ప్రభుత్వానికి ఇవ్వాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ మిల్లర్లకు ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా మిలర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో సీఎంఆర్ ధాన్యాన్ని వెంటనే ప్రభుత్వానికి ఇవ్వాలని ఆదేశించారు. లేదంటే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతే కాకుండా వానాకాలం 2024-25 సంవత్సరానికి సీజన్‌కు సంబంధించి వరిధాన్యం సన్నవడ్లు, దొడ్డు వడ్లు కొనుగోలు కేంద్రాల నుంచి దిగుమతి చేసుకోవాలని కోరారు. దిగుమతి చేసుకున్న ధాన్యాన్ని వెంటనే రసీదు అందజేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎస్‌వో మోహన్ బాబు, డీఎంసివిల్ సప్లయ్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

వైభవంగా రాజశ్యామల యాగం



రాజశ్యామల యాగంలో శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే జైపాల్

తలకొండపల్లి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): వెల్జాల వేదాద్రిగుట్టపై గల ప్రసిద్ధ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శుక్రవారం రాజశ్యామల యాగాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్, మాజీ సర్పంచ్ సంగీతల ఆధ్వర్యంలో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పండితులు గూడ యాదగిరి, నర్సింహ్మయ్యశర్మ, శ్రీనివాసమూర్తి, మురళీధర్‌శర్మ, శరత్‌చంద్రశర్మల ఆధ్వర్యంలో యాగాన్ని ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించారు. నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, ప్రజలు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని యాగాన్ని నిర్వహించామని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణగౌడ్, అంబాజీ, రవికుమార్, బి.వెంకటయ్య, మురళీధర్, లింగంగౌడ్, రాములు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో సౌకర్యాలకు పెద్దపీట



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల మున్సిపాలిటీలో సౌకర్యాలు కల్పించేందుకు పెద్దపీట వేస్తున్నట్టు చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో నిరంజన్‌రెడ్డి అధ్యక్షతన సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. మున్సిపాలిటీ పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోందని, ఇక్కడ ఏరోస్పేస్ ప్రాజెక్టులో టీసీఎస్, హెలీకాప్టర్ విడిభాగాల తయారీ యూనిట్, పలు దిగ్గజ సంస్థలు నడుస్తున్నాయన్నారు. బొంగులూరు ఔటర్ రింగ్ రోడ్డు నుంచి ఆదిభట్ల టీసీఎస్ వరకు ఉన్న రోడ్డుకు రతన్‌టాటా మార్గ్‌గా నామకరణం చేయాలని కౌన్సిల్ తీర్మానించింది. అలాగే ఆదిభట్ల వద్ద రతన్ టాటా కాంస్య విగ్రహాన్ని ఏర్పాటుకు కూడా తీర్మానించారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని కమిషనర్ బాలకృష్ణ తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో తప్పులు దొర్లకుండా నిరుపేదలనే ఎంపిక చేయాలని సూచించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ యాదగిరి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నార్సింగి ఏఎంసీ డైరెక్టర్‌గా శ్రీకాంత్‌గౌడ్




ఏఎంసీ డైరెక్టర్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న అనెగౌని శ్రీకాంత్‌గౌడ్

శంషాబాద్ రూరల్, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా శంషాబాద్ మండలం పెద్ద గోల్కొండకు చెందిన నాయకుడు అనెగౌని శ్రీకాంత్‌గౌడ్ రెండోసారి నియామకమయ్యారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసే వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. అనంతరం శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ మండలంలో కాంగ్రెస్ పార్టీని తిరుగులేని శక్తిగా మార్చేలా కృషిచేస్తానన్నారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, ఏఎంసీ చైర్మన్ కోట వేణుగౌడ్, మాజీ సర్పంచ్ ఆర్.గణేశ్‌గుప్తా, నాయకులు చంద్రారెడ్డి, మాజీ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ సుష్మామహేందర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ గోపాల్‌యాదవ్, మాజీ జడ్పీటీసీ నీరటి తన్వీరాజు, మాజీ వైస్‌ఎంపీపీ నీలా మోహన్, చిన్న గోల్కొండ ప్యాక్స్ చైర్మన్ దవనకర్‌గౌడ్, పెద్దగోల్కొండ మాజీ సర్పంచ్‌లు అనెగౌని నర్సింహగౌడ్, మాజీ ఎంపీటీసీలు సరిత, రవీందర్, ఆయన ధన్యవాదాలు తెలిపారు.

పౌష్టికాహారం అందించడమే లక్ష్యం

మూడుచింతలపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లలకు పౌష్టికాహారం అందించడమే హెచ్‌బీఎల్ ఇంజినీరింగ్ లిమిటెడ్ కంపెనీ లక్ష్యంగా ముందుకు సాగుతోందని సీఎస్ఆర్ కోఆర్డినేటర్ విజయలక్ష్మి అన్నారు. మండలంలోని కేశవరం గ్రామ పరిధిలో ఉన్న సూపర్‌సంగీత్ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం భగీరథ బాలల వికాస కేంద్రం 16వ వార్షికోత్సవ సంబురాలు నిర్వహించారు. రోజూ 28 అంగన్‌వాడీ సెంటర్లలోని 550 పిల్లలకు 160 ఎమ్ఎల్ పాలు, అరటిపండు, మిల్లెట్, చిక్కితో పాటు వారికి అవసరమైన వస్తువులను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ జనరల్ మేనేజర్ హనూష్ సూర్పనేని, కిరణ్, కృష్ణప్రసాద్, ఆంజనేయులు, శ్రీధర్, సూపర్‌వైజర్ రేణుక, అంగన్‌వాడీ టీచర్లు, పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి జాతర ప్రారంభం



గౌతాపూర్ గ్రామ శివారులోని మల్లికార్జునస్వామి ఆలయం

- గౌతాపూర్‌లో మూడురోజుల పాటు ఉత్సవాలు
- రేపు బోనాలు



మల్లికార్జునస్వామి

తాండూరు రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌతాపూర్ గ్రామ శివారులోని మల్లికార్జునస్వామి జాతరోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మూడురోజులపాటు జరిగే ఉత్సవాలకు తాండూరు చుట్టుపక్కల గ్రామాల ప్రజలతోపాటు సరిహద్దులోని కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు పెద్దఎత్తున తరలిరానున్నారు. జాతరకు సంబంధించి ఇప్పటికే ఆలయ నిర్వాహకులు పూజారి పత్తి చంద్రయ్యస్వామి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. గతేడాది గ్రామస్తుల సహకారంతో నూతనంగా పెద్ద ఆలయాన్ని నిర్మించారు. ఈ ఏడాది స్వామివారికి నాగాభరణం చేయించారు.

మూడు రోజులపాటు జరిగే కార్యక్రమాలు

నేడు(శనివారం) సాయంత్రం స్వామివారి భజన కార్యక్రమాలతోపాటు ఆదివారం(రేపు) ఉదయం గంగాస్నానం, మధ్యాహ్న 2.30గంటలకు స్వామివారి ఊరేగింపుతో ఆలయానికి రావడం, సాయంత్రం వాడవాడల నుంచి బోనాల ఊరేగింపు రాత్రి 9గంటలకు స్వామివారి ఒగ్గుకథ, 16వ తేదీన సోమవారం ఉదయం 9.30గంటలకు స్వామివారి పల్లకితో ఊరేగింపు వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితోపాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు స్టేట్‌ఫైనాన్స్ కార్పొరేషన్ మెంబర్ మల్కూడ్ రమేష్ హాజరుకానునట్లు ఆలయపూజారి పత్తి చంద్రయ్య తెలిపారు. ఈ కార్యక్రమాలకు గ్రామపెద్దలు, మాజీ ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.



మల్లికార్జునస్వామికి అలంకరించిన నాగాభరణం

పురుగుల బియ్యం వస్తే వెనక్కి పంపాలి



బియ్యాన్ని పరిశీలిస్తున్న వాసుచంద్ర

ధారూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పురుగుల బియ్యం స్టాక్ వస్తే వాటిని వెంటనే వెనక్కి పంపించాలని వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర కేజీబీవీ సిబ్బందికి సూచించారు. ధారూరులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఆయన విద్యాలయంలో నిల్వఉంచిన బియ్యం, కూరగాయలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం రోజూ కోడి గుడ్డు ఎందుకు పెట్టలేదని టీచర్లను ఆయన ప్రశ్నించగా కాం ట్రాక్టర్ గుడ్లను సరఫరా చేయలేదని సి బ్బంది తెలిపారు. రోజూ మెనూలో గుడ్లు, పండ్లు సక్రమంగా ఇవ్వటం లేదని విద్యార్థినులు ఆర్డీవో దృష్టికి తీసుకురాగా ఇక ముందు తరుచూ విద్యాలయాన్ని సందర్శిస్తామని మెనూ ప్రకారం విద్యార్థినులకు భోజనం పెట్టాల్సిందేనని ఆదేశించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ సాజిదా బేగం, ఎంపీడీవో నర్సింహులు, ఎంపీవో షపీఉల్లా ఉన్నారు.

అడ్డు తొలగించుకునేందుకే మహిళపై హత్యాయత్నం

పూడూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తులు మహిళపై హత్యాయత్నం చేసిన ఘటనకు సంబంధించిన కేసును పోలీసులు ఛేదించారు. అడ్డుతొలగించుకోవాలనే ఉద్దేశంతోనే మహిళ హత్యాయత్నం చేశారని పరిగి డీఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ మధుసూదనరెడ్డితో కలిసి శుక్రవారం నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి డీఎస్పీ వివరాలు వెల్లడించారు. హైదరాబాద్ బండ్లగూడ ప్రాంతానికి చెందిన బీబీ ఫాతిమా భర్త ఎనిమిదేళ్ల కిందట ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఆమెకు ఇద్దరు కుమారుడు ఉండగా వారి వివాహాలు అయ్యాయి. అప్పటి నుంచి ఆమె బండ్లగూడ చంద్రయాన్‌గుట్టలో కూలి పనులు చేసుకుంటూ ఒంటరిగానే ఒక గదిలో అద్దెకు ఉంటోంది. ఆమె ఇంటి పక్కనే సాగొల్ల రాజ్‌కుమార్ అనే వ్యక్తి కూడా అద్దెకు ఉంటున్నాడు. అయితే బీబీ ఫాతిమా, రాజ్‌కుమార్ మధ్య పరిచయం పెరిగి వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్నారు. ఈ విషయం రాజ్‌కుమార్ కుటుంబసభ్యులకు తెలిసి ఆయన భార్య, కొడుకుల మధ్య తరచూ గొడవలు జరిగేవి. అదేవిధంగా బీబీఫాతిమా కూడా తనను వివాహం చేసుకోవాలని రాజ్‌కుమార్‌ను పలుమార్లు కోరగా కొప్పుకోలేదు. ఎలాగైనా ఈమెను వదిలించుకుని కుటుంబంతో హాయిగా ఉండాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో రాజ్‌కుమార్, మరో వ్యక్తి సాగొల్ల ప్రభు(శ్రీను) తో కలిసి పతకం పన్నారు. బీబీఫాతిమాను సిటీలో అయితే గుర్తుపడతారని మన్నెగూడ వరకు బస్సుకు వచ్చి అక్కడ దిగారు. అనంతరం వికారాబాద్ రోడ్డుకు కొంతదూరంలో ఉన్న మామిడి తోట గేట్లు తెరిచి ఉండటంతో ఆమెను అక్కడికి తీసుకువచ్చారు. అక్కడ ముగ్గురు కలిసి మద్యం సేవించారు. మద్యం మత్తులోకి జారుకున్న బీబీ ఫాతిమాను రాజ్‌కుమార్, సాగొల్ల ప్రభు కలిసి గొంతు కోశారు. అనంతరం ఆమె మృతిచెందినట్లు భావించి, ఆమె వద్ద ఉన్న బురఖా, ఆధార్ కార్డు, పర్సు, మద్యం బాటిళ్లను ఆధారాలు దొరకకుండా కాల్చేశారు. అనంతరం ఆమె ఒంటిపై ఉన్న వస్తువులను తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఐదు బృందాలను ఏర్పాటు చేసి నిందితులను పట్టుకున్నారు. 13వ తేదీన విశ్వసనీయ సమాచారం మేరకు నిందితులను పట్టుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ.300, చాకు, దుస్తులను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వెల్లడించారు.



నిందితులను ప్రవేశపెట్టి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్

ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన సేవలందిస్తాం

ఆమనగల్లు/మాడ్గుల, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆస్పత్రుల స్థాయిని పెంచి రోగులకు మెరుగైన సేవలందిస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మాడ్గుల పీహెచ్‌సీని పది పడకల నుంచి 30 పడకలకు పెంచేందుకు ప్రతిపాదనలు పంపామన్నారు. మాడ్గుల ఆరోగ్య కేంద్రానికి ప్రభుత్వం కేటాయించిన 108 అంబులెన్స్‌ను శుక్రవారం ఆమనగల్లు మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో సుధామాధవి, మాజీచైర్మన్ బట్టు కిషన్‌రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందన్నారు. అంబులెన్స్‌ల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తామన్నారు. మాడ్గుల మండలాన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, నాయకులు సూదిని కొండల్‌రెడ్డి, పల్లె జంగయ్య, రమేశ్, సంపత్‌కుమార్, యాదయ్య, పాండుగౌడ్, విజయ డెయిరీ చైర్మన్ బొజ్జ సాయిరెడ్డి, వైద్యులు శిల్ప, మోహన్, ఎంపీడీవో పద్మావతి, మిద్దె రాములు, జంగయ్య, శ్రీనివాస్‌రెడ్డి, యాదయ్యగౌడ్, జంగయ్యగౌడ్, రమేశ్‌గౌడ్, విజయరెడ్డి, ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆమనగల్లు మార్కెట్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

ఆమనగల్లు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ అన్నారు. రైతులకు మార్కెట్‌లో మెరుగైన వసతులు కల్పించి ఆదాయాన్ని పెంచేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ తొలి సమావేశం శుక్రవారం మార్కెట్ కార్యాలయంలో నిర్వహించారు. చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మార్కెట్‌కు నూతన పాలకవర్గాన్ని నియమించిన ప్రభుత్వం, సీఎంరేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్యే నారాయణ రెడ్డిలకు ధన్యవాద తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. రైతుల విశ్రాంతి భవనం ఆధునీకరణ, ప్రహరీ మరమతులు, కడ్తాలలో సబ్ మార్కెట్ యార్డ్ ఏర్పాటుకు సమావేశంలో తీర్మానం చేశారు. మార్కెట్ ఆవరణలో నిర్మించిన 8 దుకాణాలను స్వాధీనం చేసుకొని ప్రారంభించేందుకు తీర్మానించారు. రైతుల శ్రేయస్సు, వ్యవసాయ రంగాభివృద్ధికి ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని గీతనర్సింహ చెప్పారు. ఏఎంసీ ఆదాయానికి ఎవరు గండి కొట్టే యత్నం చేసినా ఉపేక్షించం అన్నారు. సమావేశంలో ఏఎంసీ వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు కేశవరెడ్డి, పాండురంగయ్య, అంజయ్య, పి.శ్రీశైలం, పి.జంగయ్య, యు.యాదయ్య, జె.రమేశ్‌గౌడ్, సంపత్‌కుమార్, టి.రవీందర్, అజీం, నరేశ్, వెంకట్‌రెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, సూపర్‌వైజర్ రాజేశ్వరి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మార్కెట్ చైర్‌పర్సన్ గీతనర్సింహ

చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లకు సన్మానం

కడ్తాల్: ఆమనగల్లు మార్కెట్ కమిటీ నూతన చైర్‌పర్సన్ గీతనర్సింహ, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డిలను కడ్తాల మాజీ సర్పంచ్ తిరునగరి వేణుగోపాల్, నాయకుడు గూడూరు గోపాల్‌రెడ్డిలు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. రైతుల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జహంగీర్‌అలీ, శ్రీకాంత్‌రెడ్డి, ఇమ్రాన్‌బాబ పాల్గొన్నారు.

కొనసాగుతున్న సీఆర్పీల సమ్మె

మూతబడిన మండల విద్యాధికారి కార్యాలయం



సీఆర్పీల సమ్మెతో మూతబడిన విద్యాధికారి కార్యాలయం

తాండూరు రూరల్, డిసెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): తాండూరు మండల విద్యాధికారి కార్యాలయంలో తాత్కాలికంగా విధులు నిర్వహిస్తున్న సీఆర్పీలు, ఎంఐఎస్‌ల సమ్మె శుక్రవారంతో వారం రోజులకు చేరింది. దీంతో తాండూరు మండల పరిషత్ కార్యాలయం మూతబడింది. తాండూరు మండల ఎమ్మార్సీఎస్‌లో ముగ్గురు సీఆర్పీలు, ఒక ఎంఐఎస్ కో-ఆర్డినేటర్, ఏడుగురు సీఆర్పీలు, ఒక డీఈవో(డాటా ఎంట్రీ ఆపరేటర్), ఒక మెసేంజర్ తాత్కాలికంగా విధులు నిర్వహిస్తున్నారు. వీరికి ఉద్యోగ భద్రత కల్పించేందుకు వారం రోజులుగా సమ్మె నిర్వహిస్తున్నారు. అయితే ప్రభుత్వం వీరి సమస్యలను పట్టించుకోకపోవడంతో సమగ్ర శిక్షా ఉద్యోగులంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలో సమ్మె బాటపట్టారు. అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో వారికి అవస్థలు తప్పడం లేదని ఎంఐఎస్ తాత్కాలిక ఉద్యోగి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని వారు కోరారు.

హర్యానాయక్‌కు మెరుగైన చికిత్స అందించాలి



ధర్నా నిర్వహిస్తున్న తండావాసులు

బొంరాస్‌పేట్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటనలో అరెస్టయి జైలులో ఉన్న హర్యానాయక్‌కు మెరుగైన చికిత్స అందించి వెంటనే విడుదల చేయాలని గిరిజన మహిళలు ధర్నా నిర్వహించారు. లగచర్ల గేటుపై రోటిబండ తండా వద్ద పులిచర్ల కుంట, రోటి బండ తండా గిరిజన మహిళలు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. లగచర్ల ఘటనలో అక్రమంగా అరెస్టయిన వారిని వెంటనే విడుదల చేయాలన్నారు. ఇంకా ఎంత మంది అనారోగ్యంతో ఉన్నారో తమకు సమాచారం లేదని, వారిని విడుదల చేసి వారికి చికిత్స అందించాలని కోరారు. లగచర్ల ఘటనలో అరెస్టయిన వారికి ఏదైనా జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. అరెస్టుల కారణంగా రెండు తండాలతో పాటు గ్రామాల్లో కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. పోలీసులు అక్కడికి చేరుకొని వారిని సముదాయించి ధర్నాను విరమింపజేశారు. ధర్నాలో అరెస్టయిన వారి కుటుంబాల మహిళలు పాల్గొన్నారు.

షాపూర్‌లో తాగునీటి తంటాలు



తాగునీటి కోసం బోరు దగ్గర గూమిగూడిన షాపూర్ గ్రామస్థులు

మర్పల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): షాపూర్ గ్రామస్థులు వారం రోజులుగా తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని రోజులుగా మిషన్ భగీరథ తాగునీరు సరఫరా కాకపోవడంతో గ్రామంలో ఉన్న రెండు బోర్ల ద్వారా గ్రామస్థులు తాగునీటిని తీసుకెళ్తున్నారు. ఆ రెండు బోర్లలో ఓ బోరు మోటారు వారం రోజుల కిందట చెడిపోగా ఇంత వరకు మరమ్మతులు చేయించలేదు. దీంతో గ్రామస్థులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బోరుమోటార్ మరమ్మతులు చేయాలని అధికారులకు వివరించినా రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. బోరులో నీరు పుష్కలంగా లేకపోవడంతో గంటల తరబడి వేచిఉండాల్సి వస్తోందని వాపోయారు. ఇప్పటికైనా గ్రామంలో తాగునీటి సమస్యను తీర్చాలని కోరారు.

సమస్యలపై కార్మికుల ఆందోళన



ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

శంషాబాద్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): శంషాబాద్‌లోని కార్మిక శాఖ కార్యాలయం వద్ద శుక్రవారం భవన నిర్మాణ కార్మికులు, ఏఐటీయూసీ నాయకులు ధర్నా చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లేబర్ అడ్డాల దగ్గర మంచినీటి, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలనారు. కార్మికుల కోసం ఐదు రూపాయల భోజనం పెట్టాలన్నారు. కార్మికుల బయోమెట్రిక్ విధానాన్ని రద్దు చేయాలని, కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల కుటుంబాలకు పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్మికుల సెస్సును కార్మికుల సంక్షేమానికే ఖర్చు చేయాలన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌గౌడ్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతాలు, జిల్లా అధ్యక్షుడు రామస్వామి, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మల్లేష్, ప్రసాద్, చందు, రాములుగౌడ్, మండల కార్యదర్శి ఎన్.గిరి, వెంకటకృష్ణ, నర్సింహ పాల్గొన్నారు.

నాగిళ్ల పాఠశాలలో స్వయం పాలన



స్వయం పాలనలో పాల్గొన్న విద్యార్థులు

మాడ్గుల, డిసెంబర్13(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిళ్ల ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. 50 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వహించారు. తాత్కాలిగా ఉపాధ్యాయులుగా టీచర్ల సాధకబాధకాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీచర్లు రవీందర్‌రెడ్డి, లక్ష్మి, ఆనంద్, జంగయ్య, లక్ష్మయ్య, పీడి రామకృష్ణ, వేణుగోపాల్, శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం

ఆమనగల్లు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణకు కరాటే దోహదం చేస్తుందని ఆమనగల్లు ఎస్ఐ బి.వెంకటేశ్ అన్నారు. ఆమనగల్లు పోలీసుస్టేషన్ ఆవరణలో శుక్రవారం అంతర్జాతీయ కరాటే పోటీల్లో బంగారు, వెండి పతకాలు సాధించిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సోను కరాటే అకాడమి నిర్వాహకురాలు సోనుతో కలిసి విద్యార్థినులు ప్రణవి, దీక్షిత, స్రవంతి, పింకి, అరుణ, అస్మిక, హిందూ, పల్లవి, గాయత్రి, నిహారి, జస్వికలను ఎస్ఐ సత్కరించారు. విద్యతో పాటు ప్రతీ విద్యార్థిని కరాటే సాధన చేయాలన్నారు. క్రీడలు శారీరక ధారుడ్యం, మానసిక వికాసానికి దోహదపడతాయన్నారు. విద్యార్థులను కరాటే పోటీల్లో జాతీయ స్థాయిలో తీసుకుపోతున్న సోను కరాటే మాస్టర్‌ను అభినందించారు.

నైపుణ్యాన్ని వెలికితీసేందుకే సీఎం కప్ పోటీలు



తాండూరు విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకే సీఎం కప్ పోటీలు నిర్వహించినట్లు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలిపారు. తాండూరు పట్టణ, మండలస్థాయి సీఎం కప్ పోటీలు గురువారం రాత్రి ముగిశాయి. సెయింట్ మార్క్స్ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఇండోర్ స్టేడియాన్ని పూర్తి వసతులతో క్రీడాపోటీలు నిర్వహించేందుకు సిద్ధం చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, డీసీసీబీ జిల్లా వైస్‌చైర్మన్ రవీందర్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, కౌన్సిలర్ ప్రభాకర్‌గౌడ్, ఎంపీడీవో విశ్వప్రసాద్, కమిషనర్ విక్రం సింహారెడ్డి, అబ్దుల్ రవూఫ్ పాల్గొన్నారు.

నవాబుపేట: క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శుక్రవారం సీఎం కప్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో అబ్దుల్ రెహమన్, ఎంపీడీవో సి.అనురాధ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గీతాసింగ్ రాథోడ్, పీఏసీఎస్ చైర్మన్ రామ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటయ్య, సామా వెంకట్‌రెడ్డి, నాగిరెడ్డి, ప్రకాశం, శేఖర్, భీమ్‌రెడి పాల్గొన్నారు.

మోమిన్‌పేట: గ్రామీణ స్థాయిలో క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకే ప్రభుత్వం సీఎం కప్ పోటీలు నిర్వహిస్తోందని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం సీఎం కప్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ మనోహర్‌చక్రవర్తి, ఎంఈవో మల్లేశంతో కలిసి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, గౌరీశంకర్, మునిరోద్దీన్, పీడీ నారాయణమ్మ, సదానందం, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

యాలాల: క్రీడాపోటీలు విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీస్తాయని ఎంపీడీవో పుష్పలీల అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాలలో శుక్రవారం సీఎం కప్ క్రీడా పోటీలను నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీవో పుష్పలీల మాట్లాడారు. విద్యార్థులు క్రీడా పోటీలపట్ల ఆసక్తి కనబరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బంట్వారం: సీఎం కప్ క్రీడా పోటీల్లో భాగంగా గురువారం బంట్వారం మండలకేంద్రంలో నిర్వహించిన పోటీల్లో ఆదర్శ పాఠశాల, కళాశాల విద్యార్థులు ఖోఖో బాలుర విభాగంలో ప్రథమ, బాలికల విభాగంలో ప్రథమ, కబడ్డీ బాలికల విభాగంలో ప్రథమ, బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో విజయం సాధించారని ప్రిన్సిపల్ బ్యూలా తెలిపారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులు స్వరూప, వీటీ రామకృష్ణలను సన్మానించారు.



కొడంగల్: సీఎం కప్ పోటీలను ప్రారంభిస్తున్న గురునాథ్‌రెడ్డి

కొడంగల్: క్రీడాకారులను ప్రోత్సహించేందుకే రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ పోటీలు నిర్వహిస్తోందని రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి అన్నారు. సీఎం కప్ పోటీల్లో భాగంగా శుక్రవారం కొడంగల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. మండల స్థాయిలో రాణించిన వారు జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రశాంత్, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్‌గుప్త, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, ఎంపీడీవో ఉషశ్రీ పాల్గొన్నారు.

ధారూరు: ధారూరులోని బాలుర ఉన్నత పాఠశాలలో సీఎం కప్ ఆటల పోటీలను శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీలను తహసీల్దార్ సాజిదాభేగం, ఎంపీడీవో నర్సింహులు ప్రారంభించారు. అనంతరం జరిగిన సీఎం కప్ క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో షఫీఉల్లాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కీసర రూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య వివరాలిలా ఉన్నాయి. ఏపీలోని విజయవాడకు చెందిన బొప్పెన వెంకటరమణ(57) 15 సంవత్సరాల కిందట మేడ్చల్ జిల్లా కీసర మండల కేంద్రానికి వలసవచ్చాడు. సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. కాగా సినీపరిశ్రమపై ఉన్న మక్కువతో అప్పులుచేసి చిత్ర నిర్మాణానికి ఖర్చు చేశాడు. అక్కడి నుంచి తిరిగి డబ్బులు రాక చేసిన అప్పులు తీర్చలేని దుస్థితి నెలకొంది. దీంతో గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కడుపునొప్పి తాళలేక తానే స్వయంగా 108కు సమాచారం ఇచ్చాడు. ఘటనాస్థలానికి చేరుకున్న 108సిబ్బంది చికిత్స నమిత్తం అతడిని నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించటంతో అక్కడి నుండి గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం అక్కడే మృతిచెందాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం



దగ్ధమైన ఇల్లు

మూడుచింతలపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఓఇంట్లో మంటలంటుకుని భారీ ఆస్థినష్టం వాటిల్లింది. ఈ ఘటన జీనోమ్ వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. లాల్‌గడిమలక్‌పేట్ గ్రామానికి చెందిన వీరాల మాణిక్యంచారీ వడ్రంగి పనిచేస్తుండగా అతడి భార్య అనిత రోజూవారి కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. రోజూవారీలాగే పిల్లలను స్కూల్‌కు పంపించి ఇంటికి తాళం వేసి పనులకు వెళ్లారు. ఈ క్రమంలో ఇంట్లో నుంచి పొగలు రావడంతో గమనించిన స్థానికులు వారికి సమాచారం అందించి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. కానీ అప్పటికే అంతా బూడిదైపోయింది ఇంట్లో పోగుచేసుకున్న కూలీ డబ్బులు సుమారు రూ.25వేల నగదుతో పాటు వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. దాదాపు రూ.15లక్షల పైచిలుకు ఆస్థినష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం తమను ఆదుకుని ఆర్థిక సాయం అందించాలని కోరాడు.

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు.. ఇద్దరికి గాయాలు

పరిగి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదం గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ సంతోష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పెద్దమాదారం గ్రామానికి చెందిన చాకలి యాదగిరి, బోయిని మహేశ్‌లు గురువారం రాత్రి 11గంటల తర్వాత పరిగి నుంచి బైక్‌పై స్వగ్రామానికి వెళుతుండగా రంగాపూర్ శివారులో ఎదురుగా హైదరాబాద్ నుంచి పరిగి వైపు వస్తున్న పరిగి డిపోకు చెందిన ఆర్టీసి బస్సు ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న యాదగిరి, మహేశ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని పరిగి ఆస్పత్రిలో చేర్పించి అక్కడ ప్రథమ చికిత్స అనంతరం నగరానికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోష్ తెలిపారు.

అబ్బో.. వాహనం ఎంత పొడవో!



కొడంగల్ అంబేద్కర్ చౌరస్తా మీదుగా భారీ ట్రాన్స్‌ఫార్మర్‌తో వెళుతున్న వాహనం

కొడంగల్ రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అతిపెద్ద విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌తో 138 టైర్లు కలిగిన భారీ వాహనం కొడంగల్ మీదుగా కర్ణాటక వైపు శుక్రవారం వెళ్లింది. కొడంగల్ శివారు నుంచి కొడంగల్ పట్టణం దాటే వరకు పైన విద్యుత్‌తీగలు తగలకుండా వాహన సిబ్బంది చర్యలు తీసుకున్నారు. ఈ భారీ వాహనం నెమ్మదిగా వెళ్లడంతో పట్టణంలో ట్రాఫిక్ జామ్ అయింది. పట్టణ శివారుకు వెళ్లాక స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

కొనసాగుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మె శుక్రవారం నాటికి 4వ రోజుకు చేరుకుంది. శుక్రవారం మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మెకు ఏఐవైఎఫ్ జిల్లా సమితి సంఘీభావం తెలిపింది. సమగ్రశిక్షా ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ పరిష్కరించాలని ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న ఏఐవైఎఫ్ నాయకులు

పౌష్టికాహారంతో ఆరోగ్యపుష్టి

(5వ పేజీ తరువాయి)

కోసం ఖర్చు చేస్తున్న డైట్ చార్జీలను ప్రభుత్వం పెంచడంతో నాణ్యత కలిగిన పౌష్టికాహారం విద్యార్థులకు అందించడానికి అవకాశం ఉంటుంది. నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరగడంతో హాస్టళ్లు, గురుకుల, పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పౌష్టికాహారం కలగా మారిన విషయం తెలిసిందే. గత ఏడేళ్లుగా పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలపై ఉన్నతాధికారుల కమిటీ అధ్యయనం చేసింది. అల్పాహారం, భోజనంలోకి వినియోగించే 20 రకాల నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు పెరిగిన తీరును అధ్యయనం చేయడమే కాకుండా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నవోదయ విద్యాలయాల్లో డైట్ కోసం చేస్తున్న ఖర్చు, విధానాన్ని పరిశీలించింది. జాతీయ పోషకాహార సంస్థ సూచనల మేరకు విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు ప్రభుత్వం డైట్ చార్జీలు పెంచింది. సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో కొత్త మెనూ ప్రారంభించే కార్యక్రమాన్ని పండగలా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లలో నిమగ్నయ్యారు. పండగ వాతావరణం నెలకొనేలా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈమేరకు ప్రజా ప్రతినిధులు, అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించనున్నారు.

ఏడేళ్ల అనంతరం పెరిగిన డైట్ ఛార్జీలు

రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లలో ఉండి చదివే విద్యార్థులకు ఇప్పటివరకు ప్రీమెట్రిక్ హాస్టల్ విద్యార్థుల్లో 3 నుంచి 7వ తరగతి విద్యార్థులకు నెలకు రూ.950, 8 నుంచి 10వ తరగతి వరకు రూ.1,100, పోస్ట్ మెట్రిక్ విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.1,500 ఖర్చు చేస్తూ వచ్చింది. కాగా, రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లలో ఉండే విద్యార్థుల డైట్ చార్జీలు పెంచుతూ గత నవంబరులో నిర్ణయం తీసుకుంది. ప్రీమెట్రిక్ హాస్టల్ విద్యార్థుల్లో 3 నుంచి 7వ తరగతి వరకు చదివే బాలురకు నెలకు రూ.1,330, 8 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు రూ.1,540, ఇంటర్, డిగ్రీ, పీజీ చదివే విద్యార్థులకు రూ.2,100 డైట్ చార్జీలు పెంచుతూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పెరిగిన డైట్ చార్జీలతో 3 నుంచి 7వ తరగతి విద్యార్థులకు రోజుకు రూ.44.33 వంతున, 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ.5.1.33, ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులకు రూ.70 వంతున ఖర్చు చేయనున్నారు.

16 ఏళ్ల తర్వాత పెరిగిన కాస్మెటిక్ ఛార్జీలు

సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలోని విద్యార్థుల వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణ, పరిశుభ్రత కోసం ప్రభుత్వం కాస్మెటిక్ ఛార్జీలు చెల్లిస్తోంది. 2008లో పెంచిన తర్వాత ఈ ఛార్జీలు పెంచలేదు. అరకొర కాస్మెటిక్ చార్జీలతో విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. బాలికలు నెలకు రూ.75లతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థుల అవస్థలు గుర్తించిన ఉన్నతాధికారుల కమిటీ చార్జీలు పెంచాలని ప్రతిపాదించింది. ఈ ఛార్జీలు పెంచితేనే విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యంగా ఉంటారని సూచించింది. ఇంతవరకు కాస్మెటిక్ చార్జీలు.. 3 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు మొత్తం రూ.62 చెల్లిస్తూ వచ్చారు. దీంట్లో కాస్మెటిక్ చార్జీల కింద రూ.50, హెయిర్ కటింగ్ చార్జీల కింద రూ.12 ఇచ్చేవారు. అదే బాలికల్లో 3 నుంచి 7వ తరగతి వరకు చదివే వారికి నెలకు రూ.55 చెల్లిస్తూ రాగా, 8 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థినులకు రూ.75 చెల్లించారు. పెంచిన కాస్మెటిక్ చార్జీలతో 3 నుంచి 7వ తరగతి బాలురకు రూ.175, 8 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు రూ.200 చెల్లించనున్నారు. 3 నుంచి 7వ తరగతి బాలికలకు రూ.175, 8 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థినులకు రూ.275లకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. కాగా, పెంచిన కాస్మెటిక్ చార్జీలు ఈనెల నుంచే అమల్లోకి రానున్నాయి.

డైట్ కార్యక్రమాన్ని పండగలా నిర్వహించాలి

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో నేడు(శనివారం) నిర్వహించే కొత్త డైట్ కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి అన్ని సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్, కేజీబీవీల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలపై స్పెషల్ అధికారులు, హాస్టల్ వార్డెన్లు, ఎంపీవోలు వివిధ శాఖల అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నేటి కార్యక్రమాలకు పిల్లల తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి ఆహ్వానించాలని ఆదేశించారు. కొత్త మెనూలో ఏమే అందిస్తున్నామో తల్లిదండ్రులకు తెలియజేయాలని, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హాస్టల్, రెసిడెన్షియల్స్‌లో ఎంత మంది పిల్లలున్నారు? సిబ్బంది ఎంత మంది ఉన్నారో తెలపాలని, హాస్టళ్లలో ఏర్పాట్ల ఫొటోలను పంపించాలని ఆదేశించారు. మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా, జోనల్, మండల స్థాయి అధికారులు, మీడియా ప్రతినిధులు నేటి కార్యక్రమంలో పాల్గొంటారని కలెక్టర్ తెలిపారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



మాట్లాడుతున్న మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్

వికారాబాద్, డిసెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు అందిస్తుందని మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్ అన్నారు. వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని 25వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. ఇప్పటికే మునిసిపల్ పరిధిలోని ప్రతి వార్డులో ఏడుగురితో ఇందిరమ్మ కమిటీలు వేసినట్లు తెలిపారు. సర్వే ఆధారంగా అర్హులకు ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్‌కుమార్, మునిసిపల్ కమిషనర్ జాకీర్‌అహ్మద్, టీపీవో వేణుగోపాల్, ఆర్వో కృపాకర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఏసు దాను, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

పరిగి: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని పరిగి మండల వైస్ ఎంపీపీ సత్యనారాయణ అన్నారు. మండలంలోని రంగంపల్లిలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల వెరిఫికేషన్‌ను కార్యదర్శి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కలిసి పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి రాంచందర్, నాయకులు, కమిటీ సభ్యులు వీరారెడ్డి, శేషిరెడ్డి పాల్గొన్నారు.

మర్పల్లి: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రారంభమైంది. గత ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం మండలంలోని 29గ్రామ పంచాయతీల్లో 1551మంది దరఖాస్తు చేసుకున్నారు. వారి వివరాలను సంబంధిత పంచాయతీ కార్యదర్శులు సేకరించాల్సి ఉండగా అధికారులు నేరుగా వారి దగ్గరికి వెళ్లి పూర్తి వివరాలను సేకరిస్తున్నారు. అద్దెఇల్లు, సొంత ఇల్లా అంటూ దరఖాస్తుదారులతో వివరాలను సేకరిస్తున్నారు. అధికారులు నేరుగా వెళ్లి సర్వేచేయడంతో త్వరలోనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయనే ఆశతో దరఖాస్తుదారులు ఎదురుచూస్తున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

తాండూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గిరిజన హాస్టల్‌ను సీపీఎం బృందం శుక్రవారం సందర్శించింది. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ పిల్లలు చదువుకుంటున్న ప్రభుత్వ హాస్టళ్లపై వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలలో వంటషెడ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సురేష్, వెంకటేష్ ఉన్నారు.

మర్పల్లి: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించకుంటే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని మోమిన్‌పేట్ సీఐ నవీన్‌కుమార్ అన్నారు.మండల కేంద్రంలోని ఎస్టీ ఆశ్రమ పాఠశాలను సీఐ నవీన్‌కుమార్, మర్పల్లి ఎస్సై సురేశ్, ఎంపీడీవో రాజమల్లయ్య శుక్రవారం సందర్శించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు.



తాండూరు: మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్

కులకచర్ల: ముజాహిద్‌పూర్ గిరిజన బాలుర హాస్టల్‌ను ఎంపీడీవో రామకృష్ణ శుక్రవారం తనిఖీ చేశారు. వంట గది, నిత్యావసర సరుకులు, బియ్యం, కూరగాయలను పరిశీలించారు. మరుగుదొడ్లు కంపు కొట్టడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతీ రోజు శుభ్రపర్చాలని, నీరు అందుబాటులో ఉండాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సంతోష్ ఉన్నారు.

బొంరాస్‌పేట్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ పద్మావతి అన్నారు. శుక్రవారం ఆమె మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె వెంట ఎంఈవో హరిలాల్ ఉన్నారు. ప్రభుత్వం రాగి జావతో కలిగే ప్రయోజనాలను గుర్తించి పాఠశాలల్లో ఉదయం వేళ విద్యార్థులకు అందించేందుకు ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు.

కులకచర్ల: మండలంలోని బండవెల్కిచర్ల బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలను తహసీల్దార్ మురళీధర్ శుక్రవారం సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి బాలికలతో మాట్లాడారు. శనివారం నుంచి కొత్త మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. బియ్యం, కూరగాయలు, వంట సామగ్రిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బాలవరాలక్ష్మి పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాల తొలగింపు

కులకచర్ల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కులకచర్లలో రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగిస్తున్నారు. శుక్రవారం విద్యుత్ శాఖ అధికారులు స్తంభాలను తొలగించే పనులు చేపట్టారు. గ్రామాల్లో రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించకపోవడంతో డబుల్ సీసీరోడ్డు పనులు నిలిచిపోయాయి. మూడు నెలలుగా పనులు జరగకపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ స్తంభాలను తొలగించడంతో నిలిచిపోయిన సీసీరోడ్డు పనులు పూర్తయ్యే అవకాశం ఉంది.



కులకచర్లలో రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగిస్తున్న విద్యుత్ అధికారులు

సంక్షిప్తంగా..

టీఎస్ యూటీఎఫ్ కార్యవర్గం నియామకం

బషీరాబాద్: టీఎస్ యూటీఎఫ్ మండల కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవఅధ్యక్షుడిగా వై.విష్ణుమూర్తి, మండలాధ్యక్షులుగా ఎస్.రవికుమార్, ప్రధానకార్యదర్శిగా పి.వెంకటయ్య, ఉపాధ్యక్షులుగా జగదీశ్వర్, మహిళ ఉపాధ్యక్షులుగా మంజుల, బాలమణి, కోశాధికారిగా వెంకటయ్య, మీడియా కన్వీనర్‌గా శేషగిరి, కార్యదర్శిగా అంబప్రసాద్‌ను ఎన్నుకున్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈగా వెంకట్

బషీరాబాద్: బషీరాబాద్ మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ(అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు)గా పి.వెంకట్ బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆశాఖ డీఈఈ తేజబాబు శుక్రవారం ధ్రువీకరించారు.

4,352 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు

బషీరాబాద్: ఐకేపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కొనుగోలు కేంద్రంలో నేటి(శుక్రవారం) వరకు రైతుల నుంచి 4,352 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చే వరకూ కొనుగోళ్లు జరుపుతామని తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నూతన ప్రిన్సిపల్

కొడంగల్ రూరల్: కొడంగల్ ప్రభుత్వ డిగ్రీకళాశాల నూతన ప్రిన్సిపల్‌గా శ్రీనివాస్‌రెడ్డి ఉద్యోగ బాధ్యతలను చేపట్టారు. షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జంతుశాస్త్ర అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి ఉద్యోగోన్నతిపై శుక్రవారం కొడంగల్ వచ్చారు.

యాలాల అభివృద్ధికి కృషి

యాలాల: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సాయంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆయన యాలాలలో శుక్రవారం రూ.25లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, తదితర అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

కులకచర్ల: మండలంలోని రాంనగర్ గ్రామానికి చెందిన పోలెమోని లక్ష్మీకి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చింతకాయల జంగయ్య ముదిరాజ్ శుక్రవారం అందజేశారు.

టీజీయూఎస్ మండల అధ్యక్షుడిగా శంకర్

కులకచర్ల: తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం (టీజీయూఎస్) మండల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం కులకచర్లలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా రాంచందర్, అధ్యక్షుడిగా శంకర్, ప్రధానకార్యదర్శిగా పి.భాస్కర్, అసోసియేట్ సభ్యుడిగా ఖండ్య, ఉపాధ్యక్షుడిగా వి.తావుర్య, కోశాధికారిగా పాండు, సాంస్కృతిక కార్యదర్శిగా వి.పాండు, మహిళా కార్యదర్శిగా అలవేలు, మహిళా ఉపాధ్యక్షురాలిగా లక్ష్మీ, కార్యదర్శులుగా శంకర్, సోమ్లా, దేవుల, కవిత, కవిత ఎన్నికయ్యారు.

జిల్లా మహాసభను విజయవంతం చేయాలి

నవాబుపేట/పరిగి/తాండూరు రూరల్: పరిగిలో శనివారం(నేడు) జరిగే టీఎస్‌యూటీఎఫ్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు రవీందర్, ప్రధాన కార్యదర్శి పరమేశ్వర్ పిలుపునిచ్చారు. నవాబుపేట్‌లో హెచ్‌ఎం మల్లేశం పోస్టర్ ఆవిష్కరించారు. పరిగిలో ఆహ్వాన కమిటీ కన్వీనర్ వెంకటయ్య మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. తాండూరు మండల యూటీఎఫ్ అధ్యక్షుడు నారాయణగౌడ్ మహాసభలకు పెద్దఎత్తున పెద్దఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు.

నేడు కురుమ భవన్ ప్రారంభోత్సవానికి తరలాలి

పరిగి: కోకాపేట్‌లో రూ.10కోట్లతో నిర్మించిన కురుమ భవన్ ప్రారంభోత్సవానికి కురుమలు తరలివచ్చి విజయవంతం చేయాలని కురుమ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి సురేష్, కార్యదర్శి టీవీ నర్సింహులు,పరిగి మండల అధ్యక్షులు నర్సింహులు పిలుపునిచ్చారు. వారు శుక్రవారం కార్యక్రమానికి సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ

తాండూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణ శివారులోని గౌతమి మోడల్ స్కూల్‌లో శుక్రవారం అయ్యప్ప మహాపడి పూజను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి, మన జిల్లా మన పడిపూజ కార్యక్రమంలో భాగంగా అఖండ పడిపూజ కార్యక్రమాన్ని కనులపండుగగా నిర్వహించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ పినెముల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పూజ కార్యక్రమం కొనసాగింది. గురుస్వామి జైపాల్‌రెడ్డి, కన్య స్వామి పినెముల రాకేష్‌రెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్పలు పాటలు పాడి శరణుఘోషను అలపించారు. 18మెట్ల పడిపూజను శాస్త్రోక్తంగా చేపట్టారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

దోమ: మండల మాజీ వైస్ ఎంపీపీ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ బంగ్లా యాదయ్యగౌడ్, సీనియర్ జర్నలిస్టు బంగ్లా వెంకటయ్యగౌడ్ తల్లి అనసూజ ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం తాండూర్ ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

ఘట్‌కేసర్‌రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఎదులాబాద్‌లో గల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో శుక్రవారం వాయిస్ ఫర్ బాలబాలికల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు



ఘట్‌కేసర్‌లో రిలే నిరాహార దీక్షలో కూర్చున్న స్థానికులు

ఘట్‌కేసర్. డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లో రైల్వే వంతెన పనులను త్వరగా పూర్తి చేయాలని చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాడు 13వ రోజుకు చేరుకున్నాయి. ప్రధానంగా ఘట్‌కేసర్‌పట్టణం రైల్వే ట్రాక్‌తో రెండు భాగాలుగా మారింది. వంతెన నిర్మాణం పేరుతో దాదాపు ఆరునెలలుగా రైల్వేగేట్‌ను సైతం మూసివేశారు. దీంతో పాటు ఘట్‌కేసర్‌కు ఆర్టీసీబస్సులు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌కు విద్యార్థి ఎంపిక

తాండూరు రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఐనెల్లి గ్రామ శివారులోని మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థి మారుతి రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌కు ఎంపికయ్యాడు. వికారాబాద్‌లో జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో రవాణా, సమాచార వ్యవస్థపై మారుతి ఎగ్జిబిట్‌ను ప్రదర్శించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపియ్యారు. ఈ సందర్భంగా ఎంఈవో వెంకటయ్య, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవి విద్యార్థిని అభినందించారు.